క్లుప్తంగా

సమగ్ర రీ సర్వేపై నేడు గ్రామ సభ

గొలుగొండ: కొత్త ఎల్లవరం ప్రాంతంలో ఉన్న ఈనాం భూముల్లో సమగ్ర రీ సర్వేకు బుధవారం ఉదయం గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ ఆనందరావు తెలిపారు. ఈ గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారుగా 1530 ఎకరాల సాగుభూమి ఈనాం పేరున ఉందని తెలిపారు. అయితే ఈనాందార్లు, సాగుదారులకు ఇబ్బందులు లేకుండా సాగు భూములు సెటిల్‌మెంట్ చేయడం కోసం సమగ్ర రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఆర్‌బీకెలతో అన్నదాతల కష్టాలకు చెక్

దేవరాపల్లి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతలకు విత్తన, యూరియా కష్టాలు తప్పాయని కలిగొట్ల సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి అన్నారు. కలిగొట్లలో రైతు భరోసా కేంద్రాల ప్రభుత్వం సరఫరా చేసిన యూరియా బస్తాలను స్థానిక ఎంపీటీసీ రుత్తల లక్ష్మీతో కలిసి ఆమె రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాలలో విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుతున్నాయన్నారు. ఆర్‌బీకే ఇంఛార్జి పైడితల్లమ్మ, స్థానిక నాయకులు రాంబాబు పాల్గొన్నారు.

10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కె.కోటపాడు : ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చౌడువాడ పీహెచ్‌సీ పరిధిలో గల గ్రామాల్లో గల 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల 5327 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఎంపీహెచ్‌ఈవో రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోను, కళాశాలల్లోను, అంగన్‌వాడీ కేంద్రాల్లోను విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమం పూర్తయిన తరువాత మాత్రలు వేయనున్నట్టు తెలిపారు.

స్వాతంత్ర్య కాంక్ష రేపిన క్విట్ ఇండియా ఉద్యమం

చోడవరం రూరల్: నేటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు 1942 ఆగస్టు 8న మహాత్మాగాంధీ పిలుపు మేరకు ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం దేశ ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రేపిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ, ఎన్‌ఎస్‌ఎస్ మూడు యూనిట్లు, హ్యూమానిటీస్ ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని జరిపారు.

కేన్సర్ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించాలి

కేన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించాలని, అందుకు 50 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ మురళీధర్ అన్నారు. కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. స్థానిక దుర్గా ప్రసాద్ ఆస్పత్రిలో ఉచితంగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

ర్యాలీలు, ధర్నాలకు అనుమతిలేదు


టౌన్ సీఐ గణేష్

నర్సీపట్నం : పట్టణంలో సెక్షన్ 30 పోలీసు యాక్టు అమల్లో ఉన్నందున ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదని టౌన్ సీఐ ఎన్.గణేష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉందన్నారు. శాంతియుత నిరసనలు చేసే ముందు పోలీసు వారి అనుమతి తీసుకున్నట్టయితే అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

వార్డు సభ్యుడి కుటుంబానికి బీమా సాయం

చీడికాడ: మండలంలో ఖండివరం గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు మోసూరి సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి దహన సంస్కారం నిమిత్తం తక్షణ సహాయంగా వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. సచివాలయం సిబ్బంది, స్థానిక నాయకులు సుంకర శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.సన్నిబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు స్వాతి, బాలాజీ పాల్గొన్నారు.

సత్యసాయి భక్తుల వితరణ

కె.కోటపాడు : సత్యసాయి మందిరంలో మంగళవారం పేదలకు సత్యసాయి భక్తులు భోజనం అందించారు. కె.కోటపాడుకు చెందిన సత్యసాయిబాబా భక్తులు నారాయణసేవలో భాగంగా ప్రతి మంగళవారం 20 మంది పేదలకు భోజనం సమకూర్చుతున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు తెలిపారు.

బంగారుమెట్టకు బంగారుబాట..

- వీరవల్లి అగ్రహారం - బంగారుమెట్ట రహదారికి మహర్దశ
- రెండు మండలాలు కలుపుతూ రూ.1.93 కోట్ల వ్యయంతో రహదారి
- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సహకారంతో సాకారం


వీరవల్లి పెట్రోల్ బంకు నుంచి బంగారుమెట్ట రహదారి


గతంలో గోతులమయంగా ఉన్న రహదారి (ఫైల్)

మాడుగుల రూరల్: మండలంలో రెండు మండలాలను కలుపుతూ రహదారి నిర్మాణానికి పెద్ద పీట వేశారు. గతంలో గోతులమయంగా మారిన రహదారి నేడు అందంగా రూపుదిద్దుకుంది. మండలంలో వీరవల్లి అగ్రహారం పెట్రోల్ బంకు నుంచి బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట వరకు పోవు 3 కిలోమీటర్లు 350 మీటర్ల మేర రహదారి నిర్మాణం చేపట్టారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో ఉపాధి హామీ పథకం నిధులతో రూ.1.93 కోట్లు వ్యయంతో రహదారి నిర్మించారు. ఈ రహదారి నిర్మాణం వల్ల రెండు మండలాలను అనుసంధానం చేస్తూ రాకపోకలు సులభంగా సాగించడానికి ఉపయోగపడుతుంది. మాడుగుల తదితర గ్రామాల ప్రజలు నర్సీపట్నం, తుని, ఇతర దూర ప్రాంతాలకు వెళ్లడానికి వడ్డాది వెళ్లకుండా నేరుగా ఈ రహదారి మీదుగా బంగారుమెట్ట నుంచి నర్సీపట్నం చేరుకోవడానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో తుపానులు వచ్చేటప్పుడు ఈ రహదారిలో పెంటయ్యపాలెం సమీపంలో గెడ్డ నుంచి నీరు పొంగి ప్రవహించేది. దీంతో అప్పట్లో రాకపోకలు బంద్ అయి పోతనపూడి పంచాయతీ ప్రజలు బంగారుమెట్ట గ్రామం నుంచి వడ్డాది మీదుగా ప్రయాణాలు సాగించేవారు. ఈ గెడ్డ మీద విశాఖ డెయిరీ మంజూరు చేసిన నిధులతో మినీ వంతెన నిర్మించారు. ఈ రహదారి కిరువైపులా రోడ్డును వెడల్పు చేశారు. భారీ వాహనాలు కూడా ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి.

డిప్యూటీ సీఎం కృషి వల్లే...



ఈ రహదారి నిర్మాణం వల్ల పోతనపూడి, వీరవిల్లి అగ్రహారం, జి. అగ్రహారం, తదితర గ్రామాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ రహదారి గతంలో తుప్పలు డొంకలతో పాటు గోతులమయంగా ఉండేది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు కృషితో రహదారి అభివృద్ధి జరిగింది.

–కొత్తపల్లి శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, వి.వి.అగ్రహారం

శివారు గ్రామాలకు ఉపయోగం



శివారు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ రహదారి. మాడుగుల ఇతర చుట్టు ప్రక్కల గ్రామాలతో పాటు చీడికాడ మండలంలో పలు గ్రామాలు ప్రజలు ఈ రహదారి గుండా నర్సీపట్నం, తుని, రావికమతం, తదితర దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి ఈ రహదారి ఉపయుక్తంగా ఉంటుంది.

–కోరుకోండ చెల్లంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు

'గడప గడపకు' ముగింపు సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం రూరల్ : ఈనెల 13న జరపతలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపు నిచ్చారు. మంగళవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. చోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని 86 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాలన్నింటా 213 రోజులపాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ముగింపు సభకు ఉత్తరాంధ్ర పరిశీలకుడు వై.వి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సభను భారీ ఎత్తున జన సమీకరణతో విజయవంతం చేయాలని కోరారు. చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట సత్యారావు, ఓరుగంటి నెహ్రూ, సర్పంచ్ ఈశ్వరరావు, వైఎస్సార్ యూత్ వింగ్ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య పాల్గొన్నారు.

100 పశువులకు లంపీ స్కిన్ టీకాలు


బోయిలకింతాడ పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి ప్రియాంక

దేవరాపల్లి : బోయిలకింతాడలో మంగళవారం నిర్వహించిన మెగా పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబురావు ప్రారంభించిన ఈ వైద్య శిబిరంలో మామిడిపల్లి పశువైద్యాధికారి జి.ప్రియాంక వైద్య సేవలందించారు. 100 ఆవులు, ఎద్దులకు లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలను, 124 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. 23 పశువులకు గర్భకోశ, చూడి తనిఖీలు, 42 పశువులకు జనరల్ వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను తెలియజేస్తే సకాలంతో పశువుల వద్దకే వచ్చి సేవలందిస్తారన్నారు. పశువుల ఆరోగ్య, పాల దిగుబడి పెంచేందుకు ప్రభుత్వ రాయితీపై అందిస్తున్న టిఎంఆర్ మిశ్రమ ధాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ వీర్యంను ఉపయోగించడం ద్వారా 90 శాతం మేర ఆడ పశువులు జన్మిస్తాయని, రూ.500 చెల్లించి వీర్యం పొందవచ్చునన్నారు.

అన్నదాతలకు మెరుగైన సేవలందించాలి

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు


రుణాల చెక్కులను అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్)ల ద్వారా అన్నదాతలకు మరింత మెరుగైన సేవలందించాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ములకలాపల్లి పీఏసీఎస్ పరిధిలోని పలు సంఘాలకు తారువలోని క్యాంప్ కార్యాలయంలో రుణాలను, బీమా చెక్కును ఆయన చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. వేచలం గ్రామానికి చెందిన శ్రీవిశ్వబ్రహ్మణ, శ్రీ విశ్వకర్మ, శ్రీకామాక్షి దేవి జాయింట్ లైబిలిటీ గ్రూపులకు రూ.2.50 లక్షలు చొప్పున చెక్కులను ములకలాపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ రెడ్డి వెంకట కృష్ణ నాయుడు, స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు సమక్షంలో అందజేశారు. వేచలంకు చెందిన వేచలపు లక్ష్మణ ప్రమాదవశాత్తూ మృతి చెందగా అతని భార్య అరుణకు సొసైటీ నుంచి లక్ష రూపాయల బీమా చెక్కును డిప్యూటీ సీఎం అందజేశారు. ములకలాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇంఛార్జిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆర్‌వీకె నాయుడును డిప్యూటీ సీఎం బూడి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతాంగానికి సకాలంలో రుణాలు అందించి సొసైటీని లాభాల బాటలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు నారాయణరావు, సూరిబాబు, సొసైటీ సీఈవో మజ్జి వెంకటరావు పాల్గొన్నారు.

పోషణ సరకులు సద్వినియోగం చేసుకోవాలి


గాదిరాయిలో పోషణ సరకుల కిట్స్ పంపిణీ


వెంకటరాజుపురంలో ..


వేచలంలో...

మాడుగుల : వైఎస్సార్ పోషణ ప్లస్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికారాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. మంగళవారం మండలంలో గాదిరాయి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసిన పోషణ సరకుల కిట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాము నాయుడు, పంచాయతీ కార్యదర్శి వి.రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే సత్యవరం గ్రామంలో మంగళవారం వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ తలారి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, విశాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ పోలీసు పాల్గొన్నారు.

జమ్మాదేవిపేటలో టీహెచ్‌ఆర్ కిట్స్ పంపిణీ

మాడుగుల: జమ్మాదేవిపేట గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి మంగళవారం టీహెచ్‌ఆర్ కిట్స్ పంపిణీ చేశారు.

దేవరాపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని వేచలం, వెంకటరాజుపురం సర్పంచ్‌లు నాగిరెడ్డి శతారినాయుడు, దాసరి సంతోషకుమార్ అన్నారు. ఈ మేరకు వేచలం, వెంకటరాజుపురం గ్రామాలలో సర్పంచ్‌ల చేతుల మీదుగా ప్రభుత్వం సరఫరా చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు రక్తహీనత సమస్యను అధిగమించవచ్చునని సర్పంచ్‌లు శతారినాయుడు, సంతోష్‌కుమార్ సూచించారు.

బుచ్చెయ్యపేట : పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి తెలిపారు. మంగళాపురం, వడ్డాది, కొమళ్లపూడి తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ తల్లి ప్రసవించిన తరవాత గంటలోపే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టడం వల్ల తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. ఆరు నెలల వరకు బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరమని అన్నారు. వెల్ బేబీ షో నిర్వహించి, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. పలువురికి వైఎస్సార్ పోషణ కిట్లు అందించారు.

అమృత్ మహోత్సవాలు విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న 'నాభూమి నాదేశం' 75 ఏళ్ల స్వాతంత్ర్యం సందర్భంగా నిర్వహించే అమృత్ మహోత్సవం కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి ఆధ్వర్యంలో సర్పంచులు ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులు చేసే కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు అందించే సహాయ సహకారాలు ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం రోజు వారీగా నిర్వహించే కార్యక్రమాల వివరాలను మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి వివరించారు. ఎంపీడీవో హనుమంతరావు, వైస్ ఎంపీపీ పైల సునీల్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి గొర్లె వరహాలబాబు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, హౌసింగ్ పీఆర్ శాఖ జేఈలు జోగారాజు, వెంకటేశ్వరమ్మ, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక కుంకుమ పూజలు

మాడుగుల : మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని పూలు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచితంగా ప్రసాద వితరణ జరిపింది.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తప్పక గుర్తింపు


బదిలీ అయిన ఉద్యోగులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


వి.వి.అగ్రహారం పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించిన సర్పంచ్

కె.కోటపాడు : చిత్తశుద్ధితో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించే వారికి ప్రజలతో పాటు ఉన్నతాధికారుల నుంచి తప్పక గుర్తింపు లభిస్తుందని ఎంఈవో 1, 2 సత్యనారాయణ, డి.వి.డి.ప్రసాద్ అన్నారు. కె.కోటపాడు హైస్కూల్లో పనిచేసి ఇటీవల బదిలీల్లో భాగంగా ఇతర పాఠశాలలకు వెళ్లిన తొమ్మిది మంది ఉపాధ్యాయులకు పాఠశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం పద్మావతి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : మండలంలో వి.వి.అగ్రహారం ఎం.పి.యు.పి. పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల వేర్వేరు పాఠశాలలకు బదిలీ అయిన 8 మంది ఉపాధ్యాయులను మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. పాఠశాల కమిటీ చైర్మన్ దొండా హరి ఆధ్వర్యంలో జరిగిన సన్మాన సభలో సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ నారాయణరావు, స్కూలు కమిటీ మాజీ చైర్మన్ జోగారావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పూర్వ సిబ్బందికి సత్కారం


తురకలపూడి పీహెచ్‌సీలో బదిలీ అయిన సిబ్బందికి సత్కారం

బుచ్చెయ్యపేట : తురకలపూడి పీహెచ్‌సీలో పనిచేస్తూ బదిలీపై వివిధ ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్న సిబ్బంది తమ పనితనంతో మన్ననలు పొందారని, ప్రస్తుతం పని చేస్తున్న చోట కూడా బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని తురకలపూడి పీహెచ్‌సీ రెండవ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం తురకలపూడి పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో గతంలో ఇక్కడ పని చేసి వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన పలువురు ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూడీసీ శ్రీనివాస్, ఎంపీహెచ్‌వో శ్రీనివాస్, హెచ్‌వీలు భారతి, విష్ణుకుమారి, జగదీశ్వరి, సోఫియా, కమల తదితరులను సత్కరించారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు

మాడుగుల రూరల్: ప్రకృతి సేద్యం ద్వారా ఖరీఫ్ వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి సేద్యం మండల ఇన్‌చార్జి గండి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ముకుందపురం గ్రామంలో మంగళవారం రైతులకు క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన పంటలు పండించడానికి రైతులకు అవగాహన కల్పించారు. వరినాట్లు చిగుళ్లు తుంచి బీజామృతంతో శుద్ధి చేయడం ద్వారా కాండం తొలిచే పురుగులు, గుడ్లు నాశనం చేయవచ్చన్నారు. వరిపంటలో కాలిబాటలు తీయడం, లైన్ సోయింగ్ వల్ల గాలి, వెలుతురు బాగా తగలి దిగుబడి పెరుగుతుందన్నారు. పంటలకు వ్యాపించే చీడపీడలు నివారణకు కావాల్సిన కాషాయాలు, ద్రావణాలు, జీవామృతం, ప్రకృతి వనరులు కేంద్రంలో అందుబాటులో ఉంటాయని శ్రీనివాసరావు తెలిపారు.

పెరటి కూరలతో ఆరోగ్యం

మాకవరపాలెం : ప్రకృతి సేద్య పద్ధతిలో పెరటి కూరల సాగుతో ఆరోగ్యకరమైన పంట అందుతుందని ప్రకృతి సేద్య విభాగం ఇన్‌చార్జ్ సుదర్శన్ అన్నారు. మండలంలోని జి.నగరంలో మంగళవారం మహిళా రైతులకు పెరటి కూరల సాగు చేయడంపై అవగాహన కల్పించారు. వివిధ రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేయడంతో పాటు దగ్గరుండి ఖాళీ స్థలంలో విత్తనాలను వేయించారు. వీటికి తెగుళ్లు సోకకుండా ఉండేందుకు ప్రకృతి సేద్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం, ఆదాయం


శరభవరంలో ప్రకృతి ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనీ బత్తి దేవి

రోలుగుంట : ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం శరభవరం గ్రామంలో ప్రకృతి ఉత్పత్తులు..వాటితో ఆరోగ్య సాధనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక్కడ ఆ శాఖ సమకూర్చిన కొబ్బరి, జామ, మునగ, బొప్పాయి, కరివేపాకు మొక్కలను ప్రదర్శించి వాటి సాగు, వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనేక పోషక విలువలు గల ప్రకృతి ఉత్పత్తుల వినియోగం వల్ల ఆరోగ్యం సమకూరుతుందని తెలిపారు. పంట గట్లపై బెండ, వంగ, అలసందులు, చెట్టు చిక్కుడు, గోంగూర వేయడం వల్ల ఆశించిన దిగుబడితో పాటు ఆదాయం లభిస్తుందని తెలిపారు. అలాగే రత్నంపేట గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నదే కార్యక్రమం ఉద్దేశ్యం అని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి అన్నారు. వరి పంట విత్తినప్పటి నుంచి పంట చేతికి వచ్చేసరికి 14 వారాలు పడుతుందన్నారు. వరినాట్ల నుంచి పంట కోత వరకూ పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గం


అధ్యక్ష, కార్యదర్శులకు నియామక పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

గొలుగొండ : మండల ఉపాధ్యాయ పీఆర్‌టీయూ నూతన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలు ఏకగ్రీవంగా మంగళవారం నిర్వహించారు. జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు గోపీనాథ్, యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్షులుగా గండేపల్లి శ్రీరామమూర్తి, కార్యదర్శిగా రమణమూర్తిని నియమిస్తూ జిల్లా కమిటీ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మాట్లాడుతూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పని చేస్తామని, జిల్లా కమిటీ నియమించిన ప్రతి పనిని సక్రమంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ప్రతి ఇంటిలో ఓటరు సర్వే చేయండి


మాడుగులలో ఓటరు సర్వే పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్వో అనిత తదితరులు

మాడుగుల: ఇంటింటికి సర్వే చేసి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరుకి ఓటరు నమోదు చేయాలని, అలాగే తప్పులు దొర్లితే సరిచేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.డి.అనిత బీఎల్‌వోలకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మాడుగుల వచ్చిన ఆమె ఓటరు సర్వే పరిశీలించారు. అనంతరం మండలంలో గల అన్ని రాజకీయ పార్టీల నాయకులుతో సమావేశం ఏర్పాటు చేసారు. గత నెల 21 వ తేదీ నుండి ఈ నెల 21 తేదీ వరకు ఓటరు సర్వే కార్యక్రమం ఇంటింటికి జరుగుతుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు నాయకులు బీఎల్ఓలకు సహకరించాలన్నారు. మృతి చెందిన ఓటర్లను తొలగించి కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం వేగంగా పూర్తి చేయాలని బిఎల్ఓలుకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.వి.రత్నం, ఎన్నికల డీటీ పూర్ణయ పాల్గొన్నారు.

జైతవరంలో 100 మందికి కంటి పరీక్షలు

చీడికాడ : మండలంలో జైతవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. విశాఖకు చెందిన ఎల్.వి.ప్రసాద్ కంటి నేత్ర పరీక్ష కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని స్థానిక ఉప సర్పంచ్, మండల సచివాలయాలు కన్వీనర్ ఈర్లె చైతన్య ప్రారంభించారు. గ్రామంలో 20 మంది యువకులు నేత్ర దానానికి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో మంచాల మోడల్ స్కూలు కమిటీ చైర్మన్ కురచా రామకృష్ణ, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం కోటీశ్వరరావు, శిబిరం సమన్వయకర్త స్వాములు , ఆర్థోపెడిక్ సిబ్బంది సీతారాం, లీలావతి, ఫీల్డ్ అసిస్టెంట్లు భూపతి, సంతోష్, ఐ బ్యాంకు సిబ్బంది కాత్యాయని, సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంక్ పనులకు శంకుస్థాపన

బుచ్చెయ్యపేట : కొమళ్లపూడి గ్రామంలో మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. జల్‌జీవన్‌మిషన్ పథకంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఈ గ్రామానికి రూ.31 లక్షలు నిధులు మంజూరు చేశారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్ వెంకయమ్మ మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులకు పలువురు నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. గ్రామంలో 40 వేల లీటర్లు కెపాసిటీ గల మంచినీటి ట్యాంక్‌తో పాటు ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి త్వరలోనే ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ హరీష్ తెలిపారు.


మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

వెయ్యి ఎకరాల్లో వరినాట్లు పూర్తి

మాకవరపాలెం: మండలంలో వెయ్యి ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని ఏవో చరంజీవి తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ మండలంలో ఏటా ఖరీఫ్‌లో రైతులు 1200 ఎకరాల్లో వరినాట్లు వేస్తారన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు గిడుతూరు, మల్లవరం, బయ్యవరం, జి.కోడూరు, జంగాలపల్లి తదితర పల్లపు ప్రాంతాల్లో వెయ్యి ఎకరాల్లో వరినాట్లు వేశారన్నారు. మరో పది రోజుల్లో మండల వ్యాప్తంగా నాట్లు పూర్తవుతాయన్నారు.